“బాగా నీరసంగా వున్నమాట నిజమే కానీ ..... మరి బెంబేలు పడిపోకు” అన్నాడు మహదేవ్ అభిరాం మాటలకి.

“లేదు మహదేవ్ బాబూ! అభిరాం అన్నది కరెక్టే! రాత్రికీ, ఇప్పటికీ నీలో చాలా మార్పొచ్చింది!” అన్నాడు వరప్రసాదం.

“నిజమా?” ఆశ్చర్యంగా అడిగాడు మహదేవ్.

“రాత్రి నిద్ర పట్టలేదా?” అడిగాడు అభిరాం.

“నాకు బాగానే పట్టింది. పాపం కొత్త ప్లేసవటంవల్ల కాబోలు వరప్రసాదంగారే సరిగ్గా నిద్రపోలేకపోయారు.” అన్నాడు మహదేవ్.

“సరే! ముందు టిఫిన్ తినండి. చల్లారిపోతుంది” అంటూ పేకెట్స్ అందించాడు. ఇద్దరూ టిఫిన్ చేశాక కాఫీ తాగారు.

“రాత్రి మీకు నిద్రపట్టలేదా?” అడిగాడు అభిరాం వరప్రసాదం వైపు చూస్తూ.

“ఫర్వాలేదు. మహదేవ్ బాబన్నట్లు కొత్తప్లేస్‌కదా” అనేశాడు వరప్రసాదం.

అభిరాం, మహదేవ్‌కి వేసుకోవలసిన మందులూ, మంచినీళ్ళూ అందించాడు. మౌనంగా మాత్రలు మింగి వాళ్ళిద్దరివంకా చూస్తుండిపోయాడతను.

“మీ ఆఫీసులో ఎవరికీ తెలియదులా వుంది నీకు ఏక్సిడెంట్ జరిగిన విషయం” అన్నాడు అభిరాం.

“అవును! ఊరెళుతున్నానని రెండు రోజులే సెలవు పెట్టాను. వారికి చెప్పాలి విషయం” అప్పుడు గుర్తొచ్చినట్లు అన్నాడు మహదేవ్.

“ఆ విషయం నేను చూసుకుంటానులే.”

“అమ్మమ్మ నా గురించి అడిగేవుంటుంది. ఏం చెప్పావు?” అభిరాంని అడిగాడు వరప్రసాదం.

“అవును! మీ గురించి అడిగింది. ఎవరో స్నేహితుల ఇంటికి వెళ్ళారని చెప్పాను. మహదేవ్ దగ్గరున్నారని అంటే మళ్ళీ అతనికి ఏక్సిడెంట్ అయినట్లు చెప్పాలి. ఏక్సిడెంట్ అన్న పదం వింటే అమ్మమ్మకి భయం!” అన్నాడు అభిరాం.

కూతురూ, అల్లుడూ ఏక్సిడెంట్లో పోయిన దగ్గర్నుంచీ ఆ పదం వింటేనే ఆమె కంపించిపోతుందని తెలుసు మహదేవ్‌కి. వరప్రసాదం కూడా అర్థం చేసుకున్నట్లు మౌనంగా తలూపాడు.

మహదేవ్‌కి నీరసంగా అనిపించి మంచంమీద వాలిపోయాడు. వరప్రసాదం రాత్రి సంఘటనల గురించే ఆలోచిస్తుండిపోయాడు. అభిరాం ఇంటినుంచి వస్తూ తనతో తెచ్చుకున్న పుస్తకం చదవసాగాడు. మహదేవ్ దృష్టి అతని చేతిలోని పుస్తకం మీద పడింది.

“డియర్ అభిరాం!” పిలిచాడు మహదేవ్.

నవలపఠనంలో మునిగిపోయిన అభిరాంకి అతని పిలుపు వినిపించలేదు. వరప్రసాదం

కూడా అభిరాం పుస్తక పఠనంలో మునిగిపోవడం, పరిసరాలని మరిచిపోయేంతగా దానిలో నిమగ్న మైపోవడం గమనించినా పట్టించుకోలేదు.

"అభిరాం!" ఈసారి మరికొంచెం గట్టిగా పిలిచాడు మహదేవ్.

"ఏమిటి?" ఉలిక్కిపడి అడిగాడతను.

"నవల బాగుందా?" అడిగాడు మహదేవ్.

"చాలా బాగుంది!" తనని ఏడిపించటానికే అలా అడుగుతున్నాడని తెలిసీ తన్మయత్వం నటిస్తూ మరీ చెప్పాడు జవాబు.

"అన్ని రకాల నవలలు తెగ చదువుతావ్ కదా! మరి ప్రపంచంలోనే అతి ఎక్కువ పేజీలున్న నవలేమిటి?" అడిగాడు మహదేవ్.

"బహుశా 'టాల్‌స్టాయ్' రాసిన 'వార్ అండ్ పీస్' అనుకుంటాను" బదులిచ్చాడతను.

"పొరపాటు!" అన్నాడు మహదేవ్.

"మరేమిటి?" అడిగాడు అభిరాం.

"ఇంగ్లీషులో చాలా ఎక్కువ పేజీలతో నవలలు రాయడంలో 'మార్సెల్ ప్రోస్ట్'కి మంచి పేరుంది. ఆయనే సుదీర్ఘ మైన నవలలు ఎక్కువగా రాశాడు ఇప్పటివరకూ. అయితే రేమాండ్ టాలిస్ అనే మరో రచయిత మార్సెల్ ప్రోస్ట్ రికార్డుని అధిగమించాడు ..... 'డిల్యూస్' అనే నవల సగభాగమే ఆయనిప్పటివరకూ రాశాడు. ఆ సగభాగం ఏంతుంటుందో వూహించగలవా?" అడిగాడు అభిరాం వంకే చూస్తూ.

"సగభాగమే ..... ఉంటే ఓ అయిదారువందలుంటుందేమో" మామూలుగా అన్నాడు అభిరాం.

"యు ఆర్ రాంగ్ ..... ఆయన రాసిన ఆ సగం నవలే మూడువేల పేజీలుంది. గత పాతికేళ్ళుగా ఆయన నవల రాస్తూనే వున్నాడు."

"ఓహ్ ..... !" ఆశ్చర్యంగా అన్నాడు అభిరాం.

"మిగతాభాగం ఈ జన్మలోనే పూర్తిచేయాలి అంటున్నాడాయన. మాంచెస్టర్ యూనివర్సిటీలో జీరియాట్రిక్ విభాగం ప్రొఫెసర్‌గా, సాల్ఫోర్డ్ హోఫ్ హాస్పిటల్ సీనియర్ కన్సల్టెంటగా ఆయన విధులు నిర్వహిస్తున్నాడు. వైద్యశాస్త్రానికి సంబంధించి ఆయన సుమారు 130 పుస్తకాలు రాశాడు.

డిల్యూస్ నవల రెండు విభిన్న మనస్తత్వాల కలయిక. 1940లో పుట్టి. 1989లో మరణించే ఇద్దరి కథ. అందులో ఒకరు కంప్యూటర్ సంస్థాధిపతి, మరొకరు డాక్టర్. ఆ పాత్రల పేర్లు పెన్‌మాన్, రాబర్ట్‌ఆల్‌స్టాన్.

జీవితంలో అనుభవమే అన్నిటికీ మూలమని నమ్మే వ్యక్తి పెన్‌మాన్. అయితే ఆల్‌స్టాన్ దృక్పథం వేరు. జీవితం అంతా శూన్యం అని నమ్మే వ్యక్తితను. రెండు పాత్రలకి ఎక్కడా పొంతన వుండదు. కానీ రెండూ పాఠకుల సానుభూతిని పొందుతాయి.

"ఆ రెండు పాత్రలూ తన అనుభవంలోంచి పుట్టివనే" అంటాడు రచయిత రేమాండ్ టాలిస్. సగభాగం పూర్తయిన ఈ నవలలో సుమారుగా ఎన్ని పదాలు వుంటాయంటావ్?" అడిగాడతను.

"ఊహకు అందటంలేదు."

"ఏడులక్షల పదాలు."

"హారిబుల్."

ఇద్దరి సంభాషణా మౌనంగా వింటూ కూర్చున్నాడు వరప్రసాదం.

"నవలలో ఈ పాత్రలు రెండూ మరణిస్తాయి. ఒకరు గుండె పోటులో మరణిస్తే, ఇంకొకరు ఆత్మహత్య చేసుకుంటారు. ఫ్రాయిడ్, మార్క్స్, టి.ఎస్. ఇలియట్ల సాహిత్యాన్ని అభిమానించే టాలిస్ వారానికి అరవైగంటలపాటు కేవలం ఫిలోసఫీయే చదువుతాడట. అదే ఆయన అభిమాన సబ్జెక్టుల ..... నీకు దెయ్యాలూ, భూతాల సబ్జెక్ట్స్ వచ్చినట్టు" నవ్వుతూ అన్నాడు మహదేవ్.

"అంటే ..... మీకు వాటిమీద నమ్మకంలేదా?" ఆశ్చర్యంగా అడిగాడు వరప్రసాదం మహదేవ్ని.

"ఇసుమంత కూడా లేదు."

ఆశ్చర్యంగా చూశాడు వరప్రసాదం. "ఇంకా రాత్రి నాకేవో శబ్దాలు వినిపించాయి. మీకూ వినిపించాయా?" అనడుగుదామనుకున్నాడతను. అతడలా అనేసరికి ఆ ప్రస్తావన తేకూడదని నిర్ణయించుకున్నాడు.

"ఆ పుస్తకం పక్కన పెట్టి మాతో మాట్లాడరా బాబూ! ఇదేమైనా గ్రంథాలయం అనుకుంటున్నావా? ఎవరితోనూ మాట్లాడకుండా 'నిశ్శబ్దమును పాటించవలెను' అని లైబ్రరీల్లో వేలాడే బోర్డుకు న్యాయం చేకూరుస్తూన్నట్టూ, నువ్వూనూ."

అతని మాటలతో పుస్తకం మూసేసి--

"ఏం మాట్లాడనురా ..... ?" అన్నాడు అభిరాం.

"మనస్విని దగ్గరకు వెళ్ళావా?"

"ఓహ్ ..... ఆమె సంగతే మరిచిపోయాను. సాయంత్రం ఆమె పని చేసే ఆఫీస్ దగ్గర వెయిట్ చేసి నీ సమాచారం ఆమెకీ, ఆమె సమాచారం నీకూ చేరేస్తానులే" అభయమిచ్చాడతను.

అభిరాం అన్న మాటలకు మహదేవ్, వరప్రసాదంలు బిగ్గరాగా నవ్వేశారు.

*  *  *  *  *

సమయం సాయంత్రం అయిదుగంటలు. తూర్పుదిక్కుని చివరిసారిగా ఎర్రబరుస్తూ సూర్యుడు మెల్ల మెల్లగా కుంగిపోతున్నాడు.

ఒక్క మబ్బుతునక లేని నీలాకాశం ప్రైవసీకోసం భగవంతుడు పరిచేసిన పరదాలా

వుంది.

అప్పటికే వచ్చి పదినిమిషాలు అవటంతో అభిరాంకి కాస్త విసుగ్గా వుంది. 'ఈపాటికి బయటపడాలే' అనుకుంటూ దూరంగా కనిపిస్తున్న మనస్విని ఆఫీస్ వైపు చూశాడు.

అప్పుడే ఆఫీస్ మెట్లు దిగుతూ కనిపించింది మనస్విని. ఆమె తన దగ్గరికి వచ్చేంతవరకూ వేచి వున్నాడు అతను. ఎటూ చూడకుండా తిన్నగా బస్టాప్ వైపు సాగిపోతోందామె.

"మనస్విని!" తనని దాటిపోతున్న ఆమెని పిలిచాడు.

చటుక్కున చూసిందామె.

తన కారునానుకుని కనిపించాడు అభిరాం.

అతన్ని చూడగానే ఆమె మొహంలో కాంతి!

"మహదేవ్‌కెలా వుందీ?" ఆత్రంగా అడిగింది.

"బాగుంది. అతనేమో నీ గురించే కలవరిస్తున్నాడు. నువ్వేమో మీ పెళ్ళి జరగందే వాళ్ళింటికి రానంటావ్ ..... అఫ్‌కోర్స్ మహదేవ్ రమ్మని చెప్పలేదనుకో ..... వస్తే తీసుకెళతాను" అన్నాడతను.

"వద్దు! చుట్టుపక్కలెవరైనా చూస్తే బాగుండదు ..... " అంది మనస్విని.

"సరే! చెప్పాల్సింది ఏమైనా వుందా?"

"టైమ్‌కి తిని, మందులు వేసుకోమని చెప్పండి."

"సరే! వెళతాను" అన్నాడతను.

"అలాగే" అని ముందుకు సాగిపోయిందామె.

అతను కారులో కూర్చుని స్టార్ట్‌చేసి వేగంగా దూసుకుపోయాడు.

* * * * *

అప్పుడు సమయం రాత్రి ఎనిమిది గంటలవుతోంది. కాస్త అలా తిరిగొస్తే బాగుంటుందనిపించింది వరప్రసాదానికి. అభిరాం, మహదేవ్‌కి చెప్పి లేచి నడవసాగాడు. అతను హాల్లోంచి యింకా బయటకు రాకముందే పక్కఫ్లాట్ నుంచి 'భౌభౌ ..... భౌభౌభౌ ..... ' మని అదేపనిగా అరుస్తోంది కుక్క.

"డాలీ షటప్ ..... షటప్ ఐ సే" అన్న మాటలు కుక్కని అదిలిస్తూ వినిపించాయి. అప్పుడే బయటికి అడుగుపెట్టాడు వరప్రసాదం.

అతనికి ఆశ్చర్యం కలిగించిన విషయం పక్కఫ్లాట్‌లోని కుక్క ఇటుకేసి చూసే అరవడం.

శత్రువుని చూసినట్లు బిగ్గరగా అరవసాగిందది. దానివంకే చూస్తూ కొన్నిక్షణాలు వుండిపోయాడతను. చీకటిలో దాని కళ్ళు మెరుస్తున్నాయి.

"దీనిని బయటకు తీసుకురావటం భయంగా వుందే! రోజూ యిదే బాధ" అనుకుంటూ

కుక్కతోపాటు ఆ యింటి యజమాని లోపలకు వెళ్ళాడు.

ఒకటీ ఒకటీ కలిపితే రెండు అన్నట్టు తన అనుభవంలోకి వచ్చిన విశేషాలన్నీ కలుపుకుంటే ఏదో లింకు ఏర్పడినట్టయిందతనికి.

ముందురోజు మహదేవ్ ఇంటిలోని శబ్దాలు, మరునాడు అతను ఒక్కసారిగా నీరసంగా అయిపోవడం, ఇప్పుడీ కుక్క మహదేవ్ ఇంటివైపే చూస్తూ అదేపనిగా అరవడంతో అతనికి ఓ విషయం అర్థమైంది. 'మహదేవ్ ఇంటిని ఆశ్రయించుకుని ఏదో వుంది."

ఇంతలో పక్కింటి అతను మళ్ళీ బయట కనిపించాడు. వరప్రసాదం అతనివంక నడిచాడు.

పక్కఫ్లాట్‌లోంచి తనవైపు వస్తున్న అపరిచిత వ్యక్తిని అయోమయంగా చూస్తూ వుండిపోయాడతను.

"నా పేరు వరప్రసాదం. మహదేవ్‌కి దూరపు బంధువుని ..... " తనని పరిచయం చేసుకున్నాడు.

"అలాగా! ఎప్పుడూ రాలేదా? ఇదేనా రావటం?" ప్రశ్నించాడతను.

"అవును!"

"మహదేవ్‌గారు ఊరినుంచి వచ్చేశారా?"

"ఊరెళ్ళలేదు ..... చిన్న ఏక్సిడెంట్ జరిగింది. ఇన్నాళ్ళూ హాస్పిటల్‌లో వుండివచ్చాం."

"అయ్యయ్యో! మాకా విషయమే తెలియదు" బాధపడుతూ అన్నాడతను.

"ఫర్వాలేదు! ఒక్క విషయం."

"ఏమిటో చెప్పండి."

"మీ డాలీ ..... అదే కుక్క మా ఇంటివైపే చూస్తూ అరుస్తుందేమిటి?"

"నాకూ అదే అర్థంకావటంలేదు. దాన్ని బయటకు తీసుకురావటమే భయంగా వుంది. మీ యింటిని చూస్తే చాలు ఒక్కటే అరుపులు."

"ఎప్పట్నుంచీ?"

"సుమారు ఓ పది పన్నెండురోజుల క్రితం నుంచీనూ" అని అన్నాడతను.

"అలాగా!" అన్నాడు వరప్రసాదం.

"ఈ బాధ భరించలేక డాలీని మా చెల్లెలికిచ్చేద్దామని అనుకుంటున్నాం" చెప్పాడతను.

ఆ మాటకి బదులేం చెప్పాలో ఆ సమయంలో అర్థంకాక అతని వద్ద సెలవు తీసుకుని బయటపడి సెంటర్‌వరకూ వెళ్ళాడు వరప్రసాదం.

*           *           *           *           *